ముంపు సహాయక చర్యలకు కసరత్తు

- జీహెచ్‌ఎంసీ ముందస్తు ఏర్పాట్లు
- త్వరలోనే అధికారుల నియామకం

సికింద్రాబాద్ : నగరంలో రెండు భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముంపు బారి నుంచి సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టడం కోసం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. మండల పరిధిలోని ఐదు సర్కిళ్లలో భారీ వర్షాలు కురిసిన కారణంగా రక్షణ చర్యలు తీసుకునేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అత్యవసర చర్యల కోసం అవసరమైన వాహనాలను త్వరలో సిద్ధం చేసుకోవాలని సంకేతాలు ఇచ్చారు. ముఖ్యంగా వరద ఉధృతి పెరగడం, నాలాలు పొంగడం వంటి పరిస్థితుల్లో రహదారులు, పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవకుండా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

డివిజన్‌కు ఓ వాహనం...

- వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ముమ్మర ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేక వాహనాలు, పనిముట్లు, సుశిక్షితులైన సిబ్బందిని అందుబాటులోకి తీసుకుంటున్నారు.
- డివిజన్‌కు ఒకటి చొప్పున ఐదు సర్కిళ్ల పరిధిలోని అన్ని డివిజన్‌లలో వాహనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలలపాటు సహాయక బృందాలు, వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు వచ్చాయి. రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చడం, ముంపు బాధితులను రక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యల్లో ఆరితేరిన సిబ్బందిని అందుబాటులో ఉంచుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వరదనీరు తరలించడం కోసం..

- భారీ వర్షాలతో వరద నీటిని సాఫీగా బయటకు తరలించడం ద్వారా రహదారులు, లోతట్టు ప్రాంతాల ముంపును నివారించవచ్చని అధికారులు భావిస్తున్నారు. వరద నీటి నిల్వలు ఉండే ప్రాంతాలను గుర్తించి ముందే అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. దీని కోసం పలుగులు, పారలు, తాళ్లు తదితర పనిముట్లను వాహనాల్లో అందుబాటులోకి తెచ్చుకుంటున్నారు.


అత్యవసర సహాయ చర్యలకు ప్రత్యేక వాహనాలు (ఫైల్)

- వరద సహాయక చర్యలతో పాటు, వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన సందర్భాల్లో తొలగించేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సహాయక చర్యల కోసం డీసీఎం వంటి భారీ వాహనాలతో పాటు, గల్లీలు, నాలా పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లేందుకు ఆటోలను సిద్ధం చేసుకుంటున్నారు.

త్వరలో సమన్వయ సమావేశం..

జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, మల్కాజిగిరి, ముషీరాబాద్, అంబర్‌పేట్ ఐదు సర్కిళ్ల పరిధిలో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో కొద్ది రోజుల్లో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. దీనిలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ల నేతృత్వంలో జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ అధికారులను రక్షణ చర్యల్లో భాగస్వాములను చేయనున్నారు. ముంపు తదితర ప్రమాదకర పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో తక్షణ చర్యలు తీసుకునేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేందుకు సమన్వయ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు.

ప్రత్యేక అధికారుల నియామకం



కొద్ది రోజుల్లోనే పనిముట్లు, సిబ్బందితో కూడిన అత్యవసర వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అన్ని సర్కిళ్ల పరిధిలోని ఒక్కో మున్సిపల్ డివిజన్‌కు ఒక్కో వాహనాన్ని అందుబాటులో ఉంచుతాం. ప్రమాదకర పరిస్థితులెదురైతే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సహాయక చర్యలు చేపడతాం. ముఖ్యంగా నాలాలు, రహదారుల మీదుగా వరదనీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దీనికోసం డివిజన్ కో-ఇంజినీరింగ్ విభాగం అధికారిని బాధ్యులుగా నియమిస్తాం. – రవికిరణ్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్

ప్రత్యేక పూజలు


మహంకాళి ఆలయంలో బీజేపీ నేతలు

రాంగోపాల్‌పేట్ : సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్ ఆధ్వర్యంలో ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కిషన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో మరోమారు విజయం సాధించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుకున్నామన్నారు. బీజేపీ నాయకులు ఆనంద్ వ్యాస్, నరేష్, మనోహర్, దేవానంద్, శ్రీనివాస్, సంతోష్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


హరిప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త హరిప్రసాద్ మృతి బాధాకరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ బుద్ధానగర్‌లో నివాసం ఉండే బీఆర్‌ఎస్ కార్యకర్త హరిప్రసాద్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం వివేకానంద కమ్యూనిటీహాల్లో నిర్వహించిన దశదినకర్మకు హాజరైన తలసాని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ కార్యక్రమాలకు ఎంతో ఉత్సాహంగా హాజరయ్యే ప్రసాద్ మరణం పార్టీకి తీరనిలోటని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ నేతలు అశోక్‌యాదవ్, నర్సింహ, హరిసింగ్, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

బల్కంపేట అమ్మవారి కల్యాణోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

సనత్‌నగర్: భక్తులచే విశేష పూజలు అందుకుంటున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని జులై 9న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి కల్యాణోత్సవ వివరాలను తెలియజేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో ఆలయ చైర్మన్‌తో పాటు మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, ఆలయ పండితులు ఆయనను అమ్మవారి కల్యాణానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే అమ్మవారి ఆలయం అభివృద్ధి మరింత జరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించామన్నారు. కల్యాణ మహోత్సవాన్ని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహిస్తామన్నారు.

రైళ్లలో మరిచిపోయిన వస్తువుల అప్పగింత


మెడిసిన్స్ బ్యాగును యజమానికి అందజేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

అడ్డగుట్ట: రైళ్లలో ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానులకు పోలీసులు తిరిగి అప్పగించారు. ఆర్పీఎఫ్ పోలీసులు, ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన జయాశిష్ గోష్ అనే వ్యక్తి తన మెడిసిన్స్ బ్యాగును రైల్లో మరిచిపోయాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సదరు బ్యాగును స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించారు. బ్యాగులో రూ.13 వేల విలువైన మందులు, ఇతర సామగ్రి ఉన్నట్లు వివరించారు.

మరో ఘటనలో సెల్‌ఫోన్లు..

శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నెం. 10లోని జనరల్ వెయిటింగ్ హాల్‌లో ప్రయాణికుడు మరిచిపోయిన సుమారు రూ. 15 వేల సెల్‌ఫోన్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఉప్పల్‌కు చెందిన సదరు సెల్‌ఫోన్ యజమాని హర్షవర్ధన్‌కు అందజేశారు. ఎబ్నిజర్ అనే వ్యక్తి ప్లాట్‌ఫామ్ నెంబర్ – 10లో చార్జింగ్ పాయింట్ వద్ద మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి సంబంధిత పత్రాలు చూపించిన అనంతరం అతడికి అందజేసినట్లు తెలిపారు.

లాలాపేట్‌లో 'ఇంటర్ ఇండోర్ స్టేడియం టోర్నమెంట్'


టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ ఇండోర్ స్టేడియం షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు జరిగాయి. జీహెచ్‌ఎంసీ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లో భాగంగా సీనియర్ కోచ్ మహ్మద్ మసూద్‌అలీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంతో పాటు గాంధీనగర్ ఇండోర్ స్టేడియం, మల్కాజిగిరి ఇండోర్ స్టేడియం క్రీడాకారులు పాల్గొన్నారు. స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు అడబాల సాగర్, రాజు తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్య పార్కు, ప్రకాష్‌నగర్, గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 10 గంటల వరకు పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, సీపీడ బ్యూటీ క్వార్టర్స్, బృందావన్‌కాలనీ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సీఎం ఓల్డ్ క్యాంప్ ఆఫీస్, సీఎం బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయలు ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండకాయ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 28, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5 గా ఉన్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

న్యూడెమోక్రసీ నేతలను కోర్టులో హాజరుపర్చాలి

ముషీరాబాద్: వరంగల్ జిల్లా పోలీసులు 18వ తేదీ రాత్రి వరంగల్ జిల్లా హసన్‌పర్తి మండలం ఆరెపల్లి గ్రామ సమీపంలో అరెస్టు చేసిన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీకి చెందిన అజ్ఞాత దళ నాయకులు ఆబర్ల రాజన్న, సిద్ధబోయిన జీవన్, దేవిరెడ్డితోపాటు మరొకరిని వెంటనే కోర్టులో హాజరుపరచాలని, ఆ పార్టీ వరంగల్ జిల్లానేతలు నున్న అప్పారావు, ఆరెల్లి కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సరళ డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విషయాన్ని బయటకు తెలియకుండా పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త


మాట్లాడుతున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు, జనార్దన మూర్తి ఎస్పీ భారతి, మల్లాది ఉష, బండి శ్రీనివాస్

చిక్కడపల్లి: ప్రతి జీవిలోనూ దైవత్వాన్ని దర్శించిన ఆది శంకరాచార్యులు గొప్ప తత్వవేత్త అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో ఆదివారం శ్రీ త్యాగరాయ గానసభలోని కళావెంకట దీక్షితులు కళావేదికపై శంకరాచార్య సంస్మరణ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళ వీఎస్ జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల వయసులోనే సన్యాసం స్వీకరించి వేదాలకు భాష్యాలు చెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్పీ భారతి, సంగీత గురువు మల్లాది ఉష, గానసభ పాలకవర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ ద్రావిడ తదితరులు పాల్గొన్నారు.

భజన సంప్రదాయానికి అన్నమాచార్యులు ఆద్యుడు



చిక్కడపల్లి: భజన సంప్రదాయం, పదకవితాశైలికి తాళ్లపాక అన్నమాచార్యులు ఆద్యుడని వక్తలు కొనియాడారు. శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో అన్నమాచార్యులు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా 'సంగీత నాట్య నీరాజనం' శీర్షికతో కళాకారులు పలు సంగీత, నృత్యాంశాలను ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎంకే రాము, శ్రీమణి, చిక్కడపల్లి సీఐ ఎ.సీతయ్య, పండిట్ అంజిబాబు, దామోదరం నాగేందర్, జి.కృష్ణ, మధుమతి, నారోజు మోహన్, అంజన్ సాయివర్మ, సుధారాణి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మల్టీస్కిల్స్ ఉంటే రాణించవచ్చు

చిక్కడపల్లి: మల్టీస్కిల్స్ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నాట్స్ సహకారంతో తెలంగాణ బుక్ ట్రస్ట్, అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణకేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీ లేకుండా ఏ రంగం అభివృద్ధి కాదన్నారు.

విద్యార్థులు బేసిక్స్, ఇతర భాషలపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం నిర్వాహకులు బాపయ్యచౌదరికి అలిశెట్టి ప్రభాకర్ కవితల పుస్తకాన్ని ప్రదానం చేశారు. రవి తాండ్ర, ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి, కొండూరు వీరయ్య, కోయ చంద్రమోహన్, బాలకాశి పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఆదివారం నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శితలాదేవి నాభిశిల బొడ్రాయికి జలాభిషేకం, పంచామృత స్నానాభిషేకం, చంద్రపటం, అఖండ జ్యోతులు, దిష్టికుంభం, బైండ్ల కళాకారుల ఆధ్వర్యంలో శీతలాదేవి బొడ్రాయి కథ, పోతరాజుల విన్యాసాలు, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిగాయి. బస్తీ వాసులంతా పెద్దఎత్తున పాల్గొని బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించారు. ప్రజలంతా క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలతో బస్తీలో సందడి వాతావరణం నెలకొంది.

ఆకతాయిల ఆటకట్టించేందుకు సిటీ పోలీస్ యాక్ట్

- పబ్లిక్‌లో న్యూసెన్స్‌కు పాల్పడితే నేరుగా జైలుకే
- ఒక్కరోజు జైలుకెళ్లినా రికార్డుల్లో నమోదు
- 104 మందికి జైలు, మిగిలిన వారికి జరిమానా




చిలకలగూడ : ముషీరాబాద్ పఠాన్‌బస్తీకి చెందిన మహ్మద్‌జకీర్ గత కొంతకాలంగా ప్రతినిత్యం పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నాడు. బస్తీల్లో వీరంగం చేస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. సీపీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. 60 రోజులు జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి జారీచేసిన ఆదేశాల మేరకు మహ్మద్ జకీర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

- పద్మారావునగర్‌కు చెందిన ఓ మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుంది. ఈ క్రమంలో వాహనంపై వచ్చిన అడ్డగుట్టకు చెందిన ఆటో డ్రైవర్ నదీమ్‌అలీ ఆమె వెనుకభాగాన్ని అసభ్యంగా తాకి లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీపీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా.. వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.
- మెట్టుగూడకు చెందిన పరుశురామ్ మద్యం సేవించి బస్తీలో హల్‌చల్ చేస్తూ.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన పోలీసులు అతడిపై సీపీ యాక్టు ద్వారా కేసు నమోదు చేసి, అన్ని ఆధారాలతో కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రెండ్రోజుల జైలుశిక్ష విధించారు.

12 వేల ఈ – పెటీ కేసులు..

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండున్నరేళ్లలో సుమారు 12 వేల ఈ – పెటీ కేసులు నమోదు చేయగా.. వంద మందికి పైగా జైలుశిక్ష, మిగిలిన వారికి జరిమానా విధిస్తూ.. న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఒక్కరోజు జైలుశిక్షకు గురైనా ముద్దాయిగానే పరిగణించడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించే అవకాశం కోల్పోతారు. పలు కేసుల్లో నిందితులపై ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు, కోర్టులో వాదోపవాదాలు, బెయిలు, ఛార్జీషీట్, సమయం వృధా అయ్యేదని, అన్ని ఆధారాలు, సాక్ష్యాలతో ఈ – పెటీ కేసులు నమోదు చేయడంతో ఒక్క రోజులోనే నిందితుడికి శిక్ష పడుతుందని పోలీసు అధికారి వివరించారు.

నిజాం కాలం నుంచే..

నిజాం కాలం నుంచే సీపీ యాక్ట్ అమలులో ఉంది. కాగా పట్టణాల్లోని ప్రజల జీవన వ్యవహారశైలి, ఉద్యోగ, ఉపాధి సమయాలు భిన్నమైన రీతిలో ఉంటాయి. నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. సిటీ పోలీస్‌యాక్ట్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. మొత్తం 99 సెక్షన్లను సీపీ యాక్ట్‌లో పొందుపరిచారు. 1959, 1981,1992లతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈ చట్టానికి తుది మెరుగులు దిద్దారు.

రోడ్డుపై గొడవ పడితే 70బి..

రోడ్డుపై గొడవ పడితే 70బీ, గొడవపడి కొట్టుకుంటే 70సీ వంటి సెక్షన్‌లతో పాటు ఈవ్ టీజింగ్, అసభ్య ప్రవర్తన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ధూమపానం, సౌండ్ పొల్యూషన్, రహదారులకు అడ్డంగా టెంట్లు వేసి ఫంక్షన్లు చేసుకోవడం, నియమిత వేళల కంటే ఎక్కువ సమయం దుకాణాలు తెరిచి ఉంచడం, ప్రజాజీవనానికి ఆటంకం కలిగించే అన్నిరకాల అంశాలను సీపీ యాక్ట్‌లో పొందుపర్చారు.

ఈ – పెటీ కేసు అంటే...

సీపీ యాక్ట్‌లో భాగంగా పెటీ కేసులు నమోదు చేయడం ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ.. నిత్యం జరిగే వ్యవహారం. కొట్లాట, లైంగిక వేధింపులు, పబ్లిక్ న్యూసెన్స్, ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణ, ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే సందర్భాల్లో సమాచారం లేదా ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్యాబ్ (కంప్యూటర్ విత్ ఫోన్) ద్వారా ఫొటోలు, వీడియోలు తీసుకుంటారు. తేదీ, స్థలం, సమయం, ఇతర సాంకేతిక అంశాలు ఆటోమేటిగ్గా ట్యాబ్‌లో నమోదవుతాయి. నిందితులపై ఈ– పెటీ కేసులు నమోదు చేస్తారు. ఆధార్‌కార్డును అనుసంధానం చేసి అన్ని ఆధారాలతో ఆన్‌లైన్‌లో నేరుగా కోర్టుకు అందజేస్తారు. ఒకే వ్యక్తిపై అదే తరహా కేసులు నమోదైతే ఒకటి నుంచి 15 రోజుల వరకు జైలుశిక్ష, నేరాన్ని బట్టి జైలు, జరిమానా రెండూ విధిస్తారు.

చిలకలగూడ ఠాణాలో నమోదు చేసిన పెట్టీ కేసులు..


సంవత్సరం	పెట్టీ కేసులు	జైలుశిక్ష	జరిమానా
2022	7800	60	6710
2023	2749	36	2144
2024 (మే 19 వరకు)	1480	08	800
మొత్తం	12,029	104	9,654

ప్రతిరోజూ 50 ఈ - పెటీ కేసులు..



చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ సుమారు 50 వరకు ఈ – పెటీ కేసులు, చలాన్లు వేస్తున్నాం. ప్రజల భద్రతకు సీపీ యాక్టు ఎంతగానో దోహదపడుతోంది. ముషీరాబాద్ పఠాన్‌బస్తీకి చెందిన మహ్మద్ జాకీర్ తరుచూ పబ్లిక్ న్యూసెన్స్ చేస్తుంటే అన్ని ఆధారాలతో కేసు నమోదు చేయగా.. 60 రోజులు జైలుశిక్ష విధిస్తూ.. న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. సీపీ యాక్ట్‌తో పబ్లిక్ న్యూసెన్స్ కేసులు నియంత్రణలోకి వచ్చాయి. ప్రజలు, పోలీసులు పరస్పరం సహకరించుకుని ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త నిర్వచనం ఇవ్వాలి. – జైపాల్‌రెడ్డి, ఏసీపీ, చిలకలగూడ డివిజన్

సీపీ యాక్ట్‌తో చిల్లర కేసులు తగ్గాయి..



సీపీ యాక్ట్‌తో చిల్లర కేసులు చాలా వరకు తగ్గాయి. సీపీ యాక్ట్‌లోని 70, 71ఏ, బీ, సీ సెక్షన్లను విరివిగా వినియోగించి బాధితులకు న్యాయం చేకూర్చుతున్నాం. ఒక్కరోజు జైలుశిక్షకు గురైనా పోలీస్ రికార్డుల్లో ముద్దాయిగానే నమోదవుతుంది. ఇది ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాలకు ఆటంకం అవుతోంది. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సరైన మార్గంలో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. – అనుదీప్, ఎస్‌హెచ్‌ఓ, చిలకలగూడ పోలీస్‌స్టేషన్

మహిళల వేషధారణలో చోరీ

అమీర్‌పేట : మహిళల వేషధారణలో అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి చోరీకి పాల్పడిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ జెక్‌కాలనీ 4వ వీధిలోని ఆకృతి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 502లో ప్రైవేటు ఉద్యోగి కె.వెంకటేశ్వర్‌రావు నివాసం ఉంటున్నాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లోని 406 ఫ్లాట్‌లో ఆయన అల్లుడు, కుమార్తె నివసిస్తున్నారు. ఈనెల 16న రాత్రి వెంకటేశ్వర్‌రావు ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలు వెళ్లారు. 18న ఉదయం ఇంటి పనిమనిషి వెంకటేశ్వర్‌రావు కూమార్తె ఉంటున్న ఫ్లాట్‌కు వెళ్లి 502 ఫ్లాట్ తాళాలు తీసుకుని ఇంటిని శుభ్రం చేసేందుకు వచ్చింది. ఈ క్రమంలో ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలకు వెళ్లి చూడగా.. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండటంతో కుమార్తకు విషయం చెప్పారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. 18న తెల్లవారు జామున ఇద్దరు అగంతకులు మహిళల వేషధారణలో చుడీదార్, ముసుగులు ధరించి అపార్ట్‌మెంట్‌లోకి చొరబడినట్లు గుర్తించారు. ఇంటి తాళాలు పగులగొట్టి అల్మారాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, ఓ ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వీకే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు మధుమేహం, బీపీ, నేత్ర, రక్త పరీక్షలను నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు ఉచితంగా మందులతోపాటు కంటి అద్దాలను అందజేశారు. లక్ష్మీదాస్ డయగ్నొస్టిక్ సెంటర్ ప్రతినిధి గంధం బాలరాజ్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ డయాబలాసిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయమన్నారు.